ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



స్వామివారి పల్లకీ సేవలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌ తదితరులు



స్వామి వారి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్‌

సుభాష్‌నగర్‌: దూలపల్లిలోని సీతారామ చంద్ర స్వామి, విశాలాక్షి విశ్వేశ్వర స్వామి దేవస్థాన రాజగోపురం ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం అంగరంగ వైభంగా జరిగింది. పూజా కార్యక్రమాలు, పల్లకీ సేవలో ఎమ్మెల్యే వివేకానంద్‌, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దైవారాధనతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీని వారు అభినందించారు. కార్యక్రమంలో బూర్గుబావి హనుమంతరావు, బూర్గుబావి సత్యనారాయణ, కొంపల్లి మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ గంగయ్యానాయక్‌, శివకుమార్‌, దప్పు నరేందర్‌, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అడవుల పరిరక్షణకు కేవీఎస్‌ బాబు సేవలు ఎనలేనివి

రాష్ట్ర అటవీ దళాల అధిపతి ఆర్‌.ఎం.డోబ్రియాల్‌



పురస్కారం, స్వర్ణ పతకాన్ని అందజేస్తున్న ఆర్‌.ఎం.డోబ్రియాల్‌

సుభాష్‌నగర్‌: ఉమ్మడి తెలుగు రాష్ట్రాల అటవీ ప్రధాన ముఖ్య సంరక్షణ అధికారిగా కేవీఎస్‌ బాబు అడవుల పరిరక్షణకు చేసిన కృషి మరువలేనిదని రాష్ట్ర అటవీ దళాల అధిపతి ఆర్‌.ఎం. డోబ్రియాల్‌ అన్నారు. బుధవారం దూలపల్లిలోని రాష్ట్ర అటవీ అకాడమీలో అటవీ శాఖ అధికారులకు కేవీఎస్‌ బాబు స్మారక స్వర్ణ పతకాల బహూకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా డోబ్రియాల్‌ హాజరయ్యారు. అన్యాక్రాంతమైన అటవీ భూములను తిరిగి స్వాధీనం చేసుకుని మొక్కలు నాటిన కీసర రేంజ్‌ అటవీ అధికారి జె.విష్ణువర్ధన్‌, మార్కాపురం అటవీరేంజ్‌ అధికారి సుబ్బారావులకు కేవీఎస్‌బాబు స్మార స్వర్ణ పతకంతో పాటు రూ.10వేల నగదు పారితోషికాన్ని అందజేశారు. కార్యక్రమంలో అటవీ అకాడమీ డైరెక్టర్‌ డాక్టర్‌ ఎస్‌.జె. ఆషా, అదనపు సంచాలకులు ఎస్‌.రమేశ్‌, సంయుక్త సంచాలకులు బి.ప్రవీణ, కేవీఎస్‌ బాబు కుటుంబ సభ్యులు డాక్టర్‌ పద్మ రాయలు, డిప్యూటీ డైరెక్టర్లు సీ.హెచ్‌. గంగారెడ్డి, బీవీ రావు, కె.శ్రీనివాస్‌, కృష్ణ ప్రసాద్‌, వినయ్‌ కుమార్‌ సాహు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు స్థలం ఇప్పించండి!

- గదులు, ప్లే గ్రౌండ్‌కు ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రయత్నాలు
- ఉన్నతాధికారుల నిర్లక్ష్యంతో జలమండలికి కేటాయింపు
- మైదానం లేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- విస్మరిస్తున్న అధికారులు



నిరసన వ్యక్తం చేస్తున్న పాఠశాల విద్యార్థులు

నిజాంపేట్‌: బాచుపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల, మండల పరిషత్‌ ప్రాథమిక పాఠశాలలు పక్క పక్క పక్కనే ఉన్నాయి. ఇక్కడ సుమారు 800 వరకు విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థులకు సరిపడా గదులు లేవు. స్కూల్‌ పక్కనే ప్రభుత్వ స్థలం ఉండటంతో విద్యార్థులు ప్లే గ్రౌండ్‌ కోసం ఉపయోగించుకునే వారు. విద్యార్థులు ప్లే గ్రౌండ్‌గా ఉపయోగించుకునే స్థలంలో ఒక ఎకరం సర్వే నెంబర్‌ 2/3లో వాటర్‌ వర్క్స్‌ డిపార్ట్‌మెంట్‌ కోసం ప్రభుత్వం కేటాయించింది. అయితే ఈ స్థలాన్ని కేటాయిస్తే పాఠశాల విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు వద్దని వారించారు. ఉన్నతాధికారులు స్కూల్‌ పక్కనే ఉన్న స్థలాన్ని 2018లో సర్వే చేసి వాటర్‌ వర్క్స్‌ డిపార్ట్‌మెంట్‌ వాటర్‌ ఫిల్లింగ్‌ స్టేషన్‌ కోసం కేటాయించారు.

తరలింపు అసాధ్యమేనా..!

వాటర్‌ ఫిల్లింగ్‌ స్టేషన్‌ కోసం బాచుపల్లి మండలంలో పలు ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు ఉన్నాయి. ఇతర ప్రాంతంలో వాటర్‌ ఫిల్లింగ్‌ స్టేషన్‌ కోసం కేటాయిస్తే అందరికీ అనుకూలంగా ఉంటుందని గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం పునరాలోచన చేయాలని స్థానికులు కోరుతున్నారు. పాఠశాల అదనపు తరగతుల కోసం కూడా స్థలం లేదు. ప్లే గ్రౌండ్‌కు స్థలం లేకుండా పోయింది. ఈ సమస్యపై నిజాంపేట్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ అధికారులు, పాలక వర్గం సైతం ఈ స్థలాన్ని పాఠశాలకు కేటాయించాలని కోరుతున్నా ఉన్నతాధికారులు మాత్రం భిన్నంగా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

> ప్రభుత్వ పాఠశాల అదనపు గదుల నిర్మాణం కోసం, ప్లే గ్రౌండ్‌ స్థలం కోసం పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అయినప్పటికీ ఉన్నతాధికారులు మాత్రం సకాలంలో స్పందించకపోవడంతో పాఠశాల పక్కనే ఉన్న ప్రభుత్వం స్థలాన్ని జలమండలికి కేటాయించారు. పాఠశాల అదనపు గదులు, సౌకర్యాల కోసం సీఎస్‌ఆర్‌ నిధులు మంజూరు చేసేందుకు ఓ సంస్థ ముందుకొచ్చినా స్థలం కేటాయించకపోవడం విశేషం.

రూ.2 కోట్లు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్న 'వర్చుసా'

బాచుపల్లి పాఠశాలలో నూతన స్కూల్‌ భవనం నిర్మాణం కోసం, కంప్యూటర్‌ ల్యాబ్‌, సైన్స్‌ ల్యాబ్‌ లైబ్రేరీ, స్కూల్‌ బ్యాగ్స్‌, విద్యార్థులకు ఫర్నిచర్‌, మూత్రశాలలు, స్టాఫ్‌ రూం వసతులు కల్పించేందుకు వర్చుసా కన్సల్టింగ్‌ సర్వీసెస్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌ సీఎస్‌ఆర్‌ కార్యక్రమంలో భాగంగా సుమారు రూ. 2 కోట్ల వరకు నిధులు వెచ్చించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపింది. పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలం అందుబాటులోకి వస్తే పాఠశాలలు మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ఉన్నతాధికారులు చొరవ తీసుకొని విద్యార్థులకు మేలు జరిగేలా కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.



వర్చుసా వారు ఇచ్చిన లెటర్‌

క్రీడలతో మానసిక ఉల్లాసం



అభినందిస్తున్న కరస్పాండెంట్‌ స్వప్న, చైర్మన్‌ హన్మంతరెడ్డి

దుండిగల్‌: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎడ్జ్‌మౌంట్‌ స్కూల్‌ కరస్పాండెంట్‌ స్వప్న, చైర్మన్‌ బొంగునూరి హన్మంత రెడ్డి అన్నారు. బుధవారం డీ పోచంపల్లిలోని పాఠశాల ఆవరణలో యాన్యువెల్‌ క్రీడలను నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో, రింగ్‌ బాల్‌, త్రోబాల్‌ తదితర క్రీడల్లో విద్యార్థులు పోటీ పడ్డారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



రాగి జావాను పరిశీలిస్తున్న అయిలయ్య

జగద్గిరిగుట్ట: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ అయిలయ్యగౌడ్‌ అన్నారు. బుధవారం ప్రభుత్వ పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌ పాలనలో ఎన్నిసార్లు చెప్పినా అధికారులు ప్రహరీని నిర్మించలేదన్నారు. మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌ దృష్టికి తీసుకెళ్లి ప్రహరీ నిర్మింప జేస్తానని హామీ ఇచ్చారు. హెచ్‌ఎం కిషన్‌, ఉపాధ్యాయులు మహిపాల్‌ విద్యార్థులు పాల్గొన్నారు.

కొండా మోహన్‌శర్మ మృతి తీరని లోటు

సుభాష్‌నగర్‌: కుత్బుల్లాపూర్‌కు చెందిన శ్రీ గాయత్రి బ్రాహ్మణ పరిషత్‌ వ్యవస్థాపకుడు కొండా మోహన్‌శర్మ మృతి సంఘానికి తీరని లోటని శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు గోలపాటి కృష్ణమోహన్‌, ముఖ్య సలహాదారులు రమేష్‌ కుమార్‌ అన్నారు. బ్రాహ్మణ సంఘం నాయకులు బుధవారం మోహన్‌శర్మ కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కుత్బుల్లాపూర్‌ లో బ్రాహ్మణుల కార్తీక వనభోజనాలు అనగానే అందరికీ గుర్తుకు వచ్చే పేరు కొండా మోహన్‌శర్మ అని, పుష్కరకాలంగా పంచాంగాలు ముద్రిస్తూ, బ్రాహ్మణులకు కార్తీక వనభోజనాలు నిర్వహిస్తూ అందరి మన్ననలు చూరగొన్నారన్నారు. ఆయన కుటుంబాన్ని ఆదుకునేందుకు కృషి చేస్తామన్నారు.

హెచ్‌ఎంటీ కాలనీలో ఉర్సు ఉత్సవాలు

చింతల్‌: డివిజన్‌ పరిధిలోని హెచ్‌ఎంటీ కాలనీలో హజ్రత్‌ జిందా షా మదార్‌, రహమతుల్లా ఆలే ఉర్సు ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. సాయంత్రం సందలే షరీఫ్‌ నిర్వహించగా.. గురువారం చిర్‌గావ్‌ నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో హజరత్‌ జిందాషా మాదర్‌ దర్గా కమిటీ అధ్యక్షులు అబ్దుల్‌ ఖాదర్‌, ఉపాధ్యక్షులు షేక్‌ బాబు మియా, సభ్యులు మహ్మద్‌ గౌస్‌, అన్సార్‌, వాజిద్‌, జావెద్‌, సమీర్‌ తదితరులు పాల్గొన్నారు.

బాలుడిపై లైంగిక దాడికి యత్నం

మూసాపేట: ఓ పండ్ల వ్యాపారి బాలుడిపై లైంగిక దాడికి యత్నించాడు. ఈ ఘటన 15న వివేకానందనగర్‌లో జరిగింది. మంగళవారం సాయంత్రం నిందితుడిని బంధువులు స్థానికుల సహాయంతో పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పోలీసులు, బంధువుల వివరాల ప్రకారం.. బీదర్‌కు చెందిన సైలని బాబా (27)జగద్గిరిగుట్టలో నివాసం ఉంటూ వివేకానందనగర్‌ కాలనీ సప్తగిరి కాలనీలో పండ్ల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతని భార్య డెలివరీ కోసం పుట్టింటికి వెళ్లింది. వెస్ట్‌ బెంగాల్‌ నుంచి భవన నిర్మాణ పనుల నిమిత్తం వివేకానందనగర్‌ కాలనీలో పని చేస్తున్న ఓ కార్మికుడి ఐదేండ్ల కుమారుడికి సైలనిబాబా వారం రోజులుగా పండ్లు ఇస్తున్నాడు. ఈ నెల 15వ తేదీన బాత్‌రూమ్‌లోకి తీసుకెళ్లి లైంగిక దాడికి యత్నించడంతో బాలుడు కేకలు వేశాడు. కేకలు వినిపించిన బాలుడి బాబాయ్‌ బాత్‌రూం తలుపులు తీయగా.. సైలనిబాబా కత్తితో బెదిరించి పరారయ్యాడు. అయితే సప్తగిరి కాలనీలోని కనకదుర్గమ్మ తల్లి ఆలయ సమీపంలో జరుగుతున్న సంతలో బాలుడి తల్లిదండ్రులు పండ్ల అతడిని బంధించి పోలీసులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దంపతుల గొడవ.. భార్య ఆత్మహత్య

బాలానగర్‌: దంపతుల మధ్య గొడవ జరగడంతో భార్య ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన బాలానగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో బుధవారం జరిగింది. సీఐ నరసింహరాజు వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఉమాపతి, దేవి(30) దంపతులు వినాయకనగర్‌లో నివాసం ఉంటున్నారు. ఉమాపతి పని సరిగ్గా చేయకుండా కుటుంబాన్ని పట్టించుకోవడం లేదని ఇరువురి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో బుధవారం ఉదయం దేవి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జాతీయ రోలర్‌ స్కేటింగ్‌లో సత్‌జ్ఞాన్‌ విద్యార్థుల ప్రతిభ



గోల్డ్‌మెడల్స్‌ సాధించిన విద్యార్థులతో పాఠశాల కరస్పాండెంట్‌ చింతల మల్లేశం

కుత్బుల్లాపూర్‌: జాతీయ రోలర్‌ స్కేటింగ్‌ చాంపియన్‌ షిప్‌లో కుత్బుల్లాపూర్‌ వేంకటేశ్వరనగర్‌కు చెందిన సత్‌జ్ఞాన్‌ స్కూల్‌ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. యూత్‌ రోలర్‌ స్కేటింగ్‌ ఆధ్వర్యంలో నగరంలోని కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి స్టేడియంలో జరిగిన పోటీల్లో విద్యార్థి జోసెఫ్‌(01), సాయికిరణ్‌(01), హితేష్‌కుమార్‌ (01), ధీరజ్‌ (01), చరణ్‌(03), అభిరామ్‌(03), రెహాన్‌(03), సాయి అర్జున్‌రెడ్డి (04), సాయిపవన్‌(04), ఇమాన్యుయేల్‌ (04), తోమస్‌రాజ్‌ (04), వర్షిత్‌ (04), ఆర్యన్‌ (04), అవినాష్‌కుమార్‌ (04) గోల్డ్‌ మెడల్స్‌ సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్‌ చింతల మల్లేశం మాట్లాడుతూ.. స్కేటింగ్‌ పీఈటీ ప్రవళి, మరో పీఈటీ అనిత శిక్షణలో తమ విద్యార్థులు ప్రతిభ చూపడం సంతోషంగా ఉందన్నారు.

24న గౌడ సంఘం వన భోజన మహోత్సవం

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్‌ కాలనీ చిత్తారమ్మ గుడి ప్రాంగణంలో ఆదివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గౌడ సంఘీయుల 33వ కార్తీక వన భోజన మహోత్సవం నిర్వహించనున్నట్లు కూకట్‌పల్లి కౌండిన్య (గౌడ) సేవా సమితి నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి గౌడ కుల సోదర, సోదరీమణులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.



సుచిత్ర చౌరస్తాలో అవనీ డెంటల్‌ క్లినిక్‌ను ఎమ్మెల్సీ శంభీపూర్‌ రాజు ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్‌ సాయిహర్షిణి, డాక్టర్‌ శాలినీ దీక్షిత్‌, బీజేపీ మేడ్చల్‌ జిల్లా కన్వీనర్‌ మల్లారెడ్డి, కార్పొరేటర్‌ తారాచంద్రారెడ్డి, జిల్లా కార్యదర్శి భరతసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- కుత్బుల్లాపూర్‌

నేడు విద్యుత్‌ సరఫరాకు అంతరాయం

చింతల్‌: విద్యుత్తు మరమ్మతుల కారణంగా 33/11 కేవీ సబ్‌ స్టేషన్‌ న్యూ బోయిన్‌పల్లి పరిధిలో గురువారం విద్యుత్‌ సరఫరాను ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిలిపివేయనున్నట్లు ఏడీఈ లక్ష్మీనారాయణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సీతారాంపురం లీడర్‌ పరిధిలోని గణేష్‌ కాలనీ, మర్రి రామిరెడ్డి కాలనీ, యాదవ్‌ బస్తీ, ఓల్డ్‌ కల్యాణి థియేటర్‌, బృందావన్‌ కాలనీ, సిండికేట్‌ బ్యాంక్‌, కె ఎస్‌ ఫ్యాక్టరీ, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు అలీ కాంప్లెక్స్‌ ఫీడర్‌ పరిధిలోని ప్రియదర్శిని ఎంక్లేవ్‌, అలీ కాంప్లెక్స్‌, బడగూడ, ఓల్డ్‌ బోయిన్‌పల్లి లాస్ట్‌ బస్టాప్‌, లక్కీ హోమ్స్‌ రోడ్డు, సనా మిల్క్‌ సెంటర్‌, శ్రీ సాయి ఎన్‌క్లేవ్‌ తదితర ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరాను నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత



నిజాంపేట్‌: అక్రమ నిర్మాణాలపై నిజాంపేట్‌ టౌన్‌ ప్లానింగ్‌ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. బుధవారం ప్రగతినగర్‌ పరిధిలోని పలు కాలనీల్లో అనుమతి లేకుండా నిర్మించిన నిర్మాణాలను టౌన్‌ప్లానింగ్‌ సిబ్బంది పాక్షికంగా కూల్చివేతలు చేపట్టారు.

ప్రధాన రోడ్ల గేట్లను తొలగించడం అభినందనీయం



సుందరయ్య కాలనీ వద్ద అమర్చిన గేటును తొలగించిన అధికారులు

సుభాష్‌నగర్‌: ప్రజల ఇబ్బందుల దృష్ట్యా జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రధాన రోడ్డులోని గేట్లను తొలగించడం అభినందనీయమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. గాజులరామారం డివిజన్‌లోని పీపీనగర్‌, పీఎం రెడ్డి నగర్‌, చిత్తారమ్మదేవినగర్‌, భవానీనగర్‌. సుందరయ్య కాలనీ, జయశంకర్‌ నగర్‌, చంద్రగిరినగర్‌, లెనిన్‌ నగర్‌, ఉషోదయ కాలనీల ప్రజలు రాకపోకలు సాగించే సుందరయ్య కాలనీ వద్ద గేట్లు మూసివేసిన విషయాన్ని పున్నారెడ్డి ఉపకమిషనర్‌ మల్లారెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన బుధవారం రాకపోకలు ఆటంకంగా మారిన గేట్లను తొలగించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇంజినీరింగ్‌ కళాశాలలో స్పోర్ట్స్‌మీట్‌



వాలీబాల్‌ క్రీడలో పోటీ పడుతున్న విద్యార్థులు

నిజాంపేట్‌: బాచుపల్లిలోనీ వీఎన్‌ఆర్‌ వీజేఐఈటీ ఇంజినీరింగ్‌ కళాశాలలో బుధవారం అఖిల భారత ఓపెన్‌ ఇంటర్‌ కాలేజియేట్‌ స్పోర్ట్స్‌ మీట్‌ ఘనంగా ప్రారంభమైంది. 79 కళాశాలలకు చెందిన 1700 మంది విద్యార్థులు బాడ్మింటన్‌, బాస్కెట్‌బాల్‌, చెస్‌, ఫుట్‌బాల్‌, కబడ్డీ, టేబుల్‌ టెన్నిస్‌, త్రోబాల్‌, వాలీబాల్‌ పోటీల్లో పాల్గొనను న్నారు. పోటీలను కళాశాల సంచాలకులు చెన్నకేశవరావు, ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ సీడీ నాయుడు ప్రారంభించి మాట్లాడారు. గెలుపోటములు సహజమని, నిరుత్సాహ పడకుండా ప్రతిభ కనబరిచేందుకు పోటీ పడాలన్నారు. చదువుకు క్రీడలు తోడైతే అవకాశాలు మెండుగా ఉంటాయని, ఆ దిశగా విద్యార్థులు కృషి చేయాలని కోరారు.

చెత్తను తరలించకుండా అక్కడే కాలుస్తారా?



జీడిమెట్లలో చెత్తకు నిప్పుపెట్టడంతో వెలువడిన పొగ

జీడిమెట్ల: రోడ్లపై పారబోసిన చెత్తాచెదారాలను అక్కడ నుంచి తొలగించాల్సిన ఐలా మున్సిపల్‌ సిబ్బంది అక్కడే నిప్పుపెట్టి కాల్చి వేస్తున్నారు. కొన్ని రోజులుగా జీడిమెట్ల ఫేజ్‌ 2 నుంచి ఏస్వీకో ఆపరేటీవ్‌ సొసైటీకి వచ్చే రోడ్డు పక్కన చెత్త కుప్పలుగా పేరుకుపోయింది. పేరుకుపోయిన చెత్తను తొలగించాల్సిన మున్సిపల్‌ పారిశుధ్య సిబ్బంది అక్కడే నిప్పు పెట్టి కాల్చివేస్తున్నారు. చెత్తను కాల్చివేయడంతో గంటలకొద్ది చెత్త కాలుతుంది. దీంతో విపరీతమైన పొగలు వెలువడటంతో వాహనదారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. చెత్తను ఎందుకు కాలుస్తున్నారని వాహనదారులు పారిశుధ్య సిబ్బందిని అడుగగా.. తమ సూపర్‌వైజర్‌ కాల్చివేయమన్నారని సమాధానం చెప్తున్నారని పలువురు పేర్కొన్నారు.

డంపింగ్‌ యార్డుకు తరలించరా?

పారిశ్రామికవాడలో వెలువడిన చెత్తా చెదారాలను నిబంధనల ప్రకారం ఫేజ్‌– 4 లో ఉన్న డంపింగ్‌ యార్డుకు తరలించాలి. కానీ ఇక్కడ సూపర్‌వైజర్‌ ఆదేశాల మేరకు సిబ్బంది ఎక్కడ పోగైన చెత్తను అక్కడే పారబోసి నిప్పుపెడుతున్నారు. ఇప్పటికైనా చెత్తను డంపింగ్‌ ఏరియాకు తరలించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అక్రమ నిర్మాణాలను అడ్డుకోండి..

- జోరుగా అక్రమ నిర్మాణాలు
- మాముళ్ల మత్తులో అధికారులు?
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం



రాంరెడ్డినగర్‌లో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న షెడ్డు



వెంకటాద్రినగర్‌లో..

జీడిమెట్ల: సుభాష్‌నగర్‌ డివిజన్‌లో అక్రమ కట్టడాలు జోరందుకున్నాయి. కట్టడాలకు అడ్డుకట్ట వేయాల్సిన న్యాక్‌ ఇంజినీర్లే అక్రమ నిర్మాణదారులతో కుమ్మక్కైనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సుభాష్‌నగర్‌ డివిజన్‌ పరిధిలో 5 నెలలుగా అక్రమ కట్టడాలు జోరుగా సాగుతున్నాయి. దీనికి ప్రధాన కారణం జీహెచ్‌ఎంసీలో టీపీఎస్‌ల బదిలీల అనంతరం జీహెచ్‌ఎంసీలో పేరుకుపోయిన ఫైళ్లు, పనిభారంతో సెక్షన్‌ ఆఫీసర్లు కార్యాలయాలకే పరిమితమవుతున్నారు. ఇదే అదునుగా భావించిన న్యాక్‌ ఇంజినీర్లు తమ చేతివాటం ప్రదర్శిస్తూ దొరికిన కాడికి దోచుకుంటున్నారన్న చర్చ జరుగుతోంది. కొత్తగా వచ్చిన టౌన్‌ ప్లానింగ్‌ అధికారులకు ఏరియాల్లో పట్టులేక పోవడం న్యాక్‌ ఇంజినీర్లకు కలిసి వచ్చింది. సుభాష్‌నగర్‌ డివిజన్‌లోని రాంరెడ్డినగర్‌లో ఓ భారీ షెడ్డుతోపాటు వెంకటాద్రినగర్‌లో వెలుస్తున్న ఓ నాలుగు అంతస్తుల భవన నిర్మాణం న్యాక్‌ ఇంజినీర్ల మద్దతుతో పనులు ముందుకు సాగుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. స్థానికులు అధికారులకు ఫిర్యాదులు చేసినా వారు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

నోటీసుల పేరుతో కాలయాపన

సుభాష్‌నగర్‌ డివిజన్‌లోని రాంరెడ్డినగర్‌తో పాటు వెంకటాద్రినగర్‌లోని అక్రమ కట్టడాలపై స్థానికులు టీపీఎస్‌ అధికారులకు ఫిర్యాదు చేశారు. 5 నెలల నుంచి న్యాక్‌ ఇంజినీర్లు ఒక్క నోటీసు మాత్రమే నిర్మాణదారులకు అందజేశారు. తరువాత స్పందించకుండా నోటీసులు ఇచ్చామంటూ కాలం వెల్లదీస్తున్నారు. నోటీసులు ఇచ్చినా మరోవైపు నిర్మాణదారులు చకచక పనులు చేసేలా అధికారులే ప్రోత్సహిస్తున్నారని ఫిర్యాదుదారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు స్పందించి అక్రమ కట్టడ్డాలను అడ్డుకోవాలని, న్యాక్‌ ఇంజినీర్ల చేతివాటానికి కళ్లెం వేయాలని ప్రజలు కోరుతున్నారు.

బస్తీ దవాఖానా పనులు పూర్తి చేయాలి



బస్తీ దవాఖానా పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

మోతీనగర్‌: అల్లాపూర్‌ డివిజన్‌లో జరుగుతున్న బస్తీ దవాఖానా పనులను వెంటనే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం కార్పొరేటర్‌ సబిహా బేగంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు, కాంట్రాక్టర్‌లు పనుల్లో జాప్యం చేయడం వల్ల వేగవంతంగా జరగడం లేదన్నారు. వీలైనంత త్వరగా అధికారులు సహకరించి ఆసుపత్రి సిబ్బందికి, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో గౌసుద్దీన్‌, ఐలయ్య, వీరారెడ్డి, అస్లాం, సలావుద్దీన్‌, హమీద్‌, మొయిన్‌, వాజిద్‌, రఫీక్‌, దుర్గ, ఈఈ శ్రీనివాస్‌, డీఈ శంకర్‌ పాల్గొన్నారు.

ప్రహరీ పనులు నిలిపివేయాలి

మూసాపేట: కై త్లాపూర్‌ సమస్యను పరిష్కరించి, స్థానికంగా ఉన్న ఆలయానికి కావలసిన స్థలం సమస్యను పరిష్కరించే వరకు ప్రహరీ పనులు నిలిపివేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బాలాజీనగర్‌ డివిజన్‌ పరిధిలోని కై త్లాపూర్‌ గ్రామం చుట్టూ హౌసింగ్‌ బోర్డు వారు కంచె వేస్తున్న విషయంపై స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి బుధవారం హౌసింగ్‌ బోర్డు అధికారులతో మాట్లాడారు. కాలనీ వాసులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూసుకుంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్‌ బాబురావు, నాయకులు యాదయ్య గౌడ్‌, సంతోష్‌, గ్రామస్తులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘం, ధోబీఘాట్‌ ప్రాంతాల పరిశీలన

కేపీహెచ్‌బీకాలనీ: బ్రాహ్మణ సంఘం భవనం, ధోబీ ఘాట్‌ ప్రాంతాలను కార్పొరేటర్‌ మండడి శ్రీనివాస రావు, జీహెచ్‌ఎంసీ డీసీ వంశీకుమార్‌, అధికారులతో కలిసి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధోబీ ఘాట్‌, బ్రాహ్మణ సంఘం భవనం చుట్టూ నిర్మించే ప్రహరీ పనులను పూర్తి చేయాలన్నారు. అదే విధంగా వాటికి సంబంధించిన గేట్లను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఈ శ్రీనివాస్‌, డీఈ శ్రీదేవి, ఏఈ సాయి ప్రసాద్‌, రాజేష్‌ రాయ్‌, సాయిబాబా చౌదరి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.